కాచిగూడలో తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ:తాగునీటి సరఫరాలో అంతరాయం, నల్లాల్లో లోప్రెషర్ సమస్యతో కాచిగూడ డివిజన్‌లోని మణియార్‌పట్టి, కుద్బిగూడ, వాల్మీకినగర్, మోతీమార్కెట్, సూరజ్‌నగర్, ఎంఎ నగర్, బర్కత్‌పుర, భూమన్న లేన్ తదితర ప్రాంతాల ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. ఈ మేరకు జలమండలి నారాయణగూడ జీఎం రామకృష్ణను సోమవారం ఆయా ప్రాంతవాసులతో వెళ్లి కలిశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. వేసవిలో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బల్వీర్, సుభాష్ పటేల్, ఆరవింద్, వాసు, అవినాష్, జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించినప్పుడే వారు సమాజానికి సేవలు అందించగలుగుతారని న్యూ ఎరా జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాలెడ్జ్ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఆధునిక, సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. సమ్రీన్ అనే ముస్లిం విద్యార్థిని శ్రీరామచంద్రుడి వేషధారణతో అందరి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌పీ అధ్యక్షుడు బి. దీపక్‌కుమార్, హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ విద్యావేత్త శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ డి.లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



రజక ఫిషర్‌మెన్ సొసైటీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మెట్టు సాయికుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రజకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలంగాణ ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీ కమిటీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ... రజకులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రజకులకు ఉపాధి కల్పన కోసం ఫిషర్‌మెన్ సొసైటీలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని కొనియాడారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తన గొప్పతనాన్ని చాటుకున్నారని తెలిపారు. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు, రాష్ట్ర అధ్యక్షుడు చాకలి రాజు, కార్యదర్శి రామస్వామి, రాజశేఖర్, కాశీం, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరామాంజనేయ యుద్ధ నాటకం



చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర చలన అభివృద్ధి సంస్థ సౌజన్యంతో వల్లూరు శ్రీహరి రావు ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటకోత్సవ ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. సోమవారం త్యాగరాయ గానసభలో తాండ్ర సుబ్రహ్మణ్యం రచించిన శ్రీరామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన ప్రేక్షక రంజకంగా సాగింది. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ రచయిత ఎంకే రాము ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఏపీ మైన్స్ పూర్వ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, లోకం కృష్ణయ్య, సత్య, మణిపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కామేశ్వర్‌రావు, రామరాజు, రమాదేవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ.. లొల్లి..!

- కేసీఆర్ ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆందోళనకు దిగిన నేతలు



బీజేపీ ఫ్లెక్సీని తొలగించకుండా బీఆర్‌ఎస్ ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం



ఆర్టీసీ క్రాస్ రోడ్డులో పోలీసుల తీరుకు నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముషీరాబాద్/చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన భారీ కట్ అవుట్‌లు, ఫ్లెక్సీలను స్వయంగా పోలీసులే తొలగించడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ కార్యక్రమాలు ముగిసినా వారి ఫ్లెక్సీలను తొలగించకుండా కావాలనే బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు తొలగించారని పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా ఎలా తొలగిస్తారని పోలీసులను బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రశ్నించడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకే బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను తొలగించామని తెలిపారు. పోలీసులు చెప్పే ఆడియోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఆగ్రహం చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ క్రాస్‌రోడ్డుకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

అసలేం జరిగిందంటే..?

◆ కేసీఆర్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయం, ఇందిరాపార్కు చౌరస్తా, ఎల్‌ఐసీ బ్రిడ్జి, ముషీరాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో భారీ కేసీఆర్ కట్ అవుట్‌లను ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత బీఆర్‌ఎస్ పోలీసులు ఫ్లెక్సీలను తొలగించడం ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని వివరించారు.

◆ సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసి రెండు రోజులైనా ఆ ఫ్లెక్సీలను తొలగించకుండా కేవలం బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను తొలగించలేదు. ఇది రాజకీయంగా కక్షసాధింపు చర్యగా భావించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు సోమవారం ఉదయం బుద్ధ భవన్‌లోని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కార్యాలయాన్ని ముట్టడించాలని అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం ఉదయం 8గంటల తరువాత బీజేపీ ఫ్లెక్సీలను సైతం తొలగించడం ప్రారంభించారు.

కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లుగా పోలీసులు...

◆ కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, నియంతృత్వంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే గృహ నిర్బంధాలు, అరెస్టులు ఇప్పుడు సర్వ సాధారణం అయ్యాయని అన్నారు. బీజేపీ ఫ్లెక్సీలను ముట్టుకోకుండా కేసీఆర్ ఫ్లెక్సీలను తొలగించడం చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని అర్థం అవుతుందని అన్నారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రనా కేసీఆర్ పేరును తొలగించలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, వై.శ్రీనివాస్, శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, బీఆర్‌ఎస్ నాయకులు సేవా కార్యక్రమాలతో సంబురాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

– ముషీరాబాద్,అంబర్‌పేట జోన్ బృందం



కాచిగూడలో బీఆర్‌ఎస్ కార్యకర్తల నడుమ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఫీవర్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్



ఎస్సార్టీలోని పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు



కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్



బాగ్ అంబర్‌పేటలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి

బీసీ కులగణన రీ-సర్వేను
సద్వినియోగం చేసుకోండి

తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



కులగణన రీ-సర్వేపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

నల్లకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన సర్వేను ఈనెల 26 వరకు పొడిగించిందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ చెప్పారు. గతంలో కొన్ని కారణాలతో సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోని బీసీ కుటుంబాలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీ జనగణన రీసర్వే ప్రక్రియ తెలుసుకునేందుకు బీసీ కమిషన్ చైర్మన్ సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని శంకరయ్యనగర్, డీడీ కాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బీసీ జనగణన ఎందుకోసమనే వివరాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ మాజీ రాష్ట్ర కన్వీనర్ గంటి చంద్రుడు, లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు రామారావు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కనకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కుల గణనలో పాల్గొనాలి



కులగణన అవగాహన కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాష్

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెండోసారి చేపట్టిన కుల గణనలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాష్ సూచించారు. కుల గణన రీ సర్వేలో భాగంగా సోమవారం ఎస్సార్టీ క్వార్టర్స్‌లో కాంగ్రెస్ మహిళా నేత గుర్రం చంద్రకళాశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కులగణన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. కుల గుణన సర్వే ప్రకారం బీసీ జానాభా ఎంతో తెలుస్తుందన్నారు. అప్పుడే దామాషా ప్రకారం రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందని తెలిపారు. అందుకే తమ కులానికి సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమాచారి, శ్రీనివాస్, ప్రదీప్, ధన్‌రాజ్, కాంగ్రెస్ నేతలు జాన్, శ్రీనివాస్, దినేష్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అందాల ఓ చిలుకా..

- ఘనంగా సినీనటి జమున జయంతి
- జమునకు పద్మ అవార్డు ప్రకటించాలి: వంశీ రామరాజు



చిక్కడపల్లి: కళాకారుల సంక్షేమానికి ప్రముఖ సినీనటి జమున విశేష కృషి చేశారని కేంద్ర ప్రభుత్వం జమునకు పద్మ పురస్కారం ప్రకటించాలని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు డిమాండ్ చేశారు. గానసభలోని లలిత కళా వేదికలో వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం సినీనటి జమున జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమునకు రెండు తెలుగు రాష్ట్రాలలో ఎందరో అభిమానులున్నారని అన్నారు. ఆమెకు పద్మ అవార్డు ప్రకటించేలా రెండు రాష్ట్రాల ప్రభుత్వాల కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'అందాల ఓ చిలుకా..'శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సుంకర పల్లి శైలజ, గాయనీ గాయకులు ఆర్‌కె.ఫణి, నిషిత రామలక్ష్మి, లలిత రావు, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై మూకదాడిని ముక్తకంఠంతో ఖండించాలి

జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి



కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమణ మూర్తి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై మూకదాడిని ముక్తకంఠంతో ఖండించాలని జైభారత్ జాతీయ ప్రధానకార్యదర్శి రమణ మూర్తి పిలుపునిచ్చారు. రామరాజ్య స్థాపన ఆర్మీ పేరిట వీరరాఘవరెడ్డి అనే ఉన్మాది 20మందితో కలిసి మూకుమ్మడిగా దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

◆ ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ... రామరాజ్యం అంటే హింసాత్మక దాడులా అని ప్రశ్నించారు. త్రిశూల్ పేరుతో యువతచేతుల్లో మారణాయుధాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం వేరు మతోన్మాదం వేరు అని ఈ రెండింటిని ఒకటిగా చూడటం సరైందికాదన్నారు. రంగరాజన్‌ను బెదిరించడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేసి అడ్డు వచ్చిన తన కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారని తెలిపారు.

◆ అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి మాట్లాడుతూ... అసమానతలపై ధర్మపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉన్మాదం తలకెక్కిన వీరరాఘవరెడ్డి లాంటి వ్యక్తులు దేశంలో అనేక మంది ఉన్నారని అన్నారు. అలాంటి వారిని పౌరసమాజం ఏరివేయాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, ఎస్‌వీకే కార్యదర్శి వినయ్ కుమార్, జి. రాములు, పి.సాగర్, కోట రమేష్, ఆర్.వెంకట్రాములు, బి.ప్రసాద్, వంగూరి రాములు, శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్, అంబర్‌నగర్, లలితానగర్, రాంనగర్‌గుండు తదితర ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 12గంటల వరకు... ఎల్‌ఎన్‌నగర్ ఫీడర్ పరిధిలో వారాసీగూడ, అంబర్‌నగర్, అశోక్‌నగర్ నాలా, పుల్లయ్య బావి తదితర ప్రాంతాలలో 12గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

టీయూసీఐ అధ్యక్ష, కార్యదర్శిగా ఎస్‌ఎల్ పద్మ, పి.ప్రవీణ్

ముషీరాబాద్: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో టీయూసీఐ ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లింగంగౌడ్, కె.నల్లన్న, సహాయ కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్, కె.ఎస్.ప్రదీప్, కోశాధికారిగా డి.లక్ష్మితో పాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలి



అవగాహన సదస్సులో డాక్టర్ బీకే శ్రీలత

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మంచి వ్యక్తిత్వం ఉన్నవారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రముఖ విద్యావేత్త డా. బీకే శ్రీలత అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో 'సెల్ఫ్ ఎంపవర్‌మెంట్ ఫర్ సక్సెస్' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపాల్ డా. సృజన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జలమండలికి రాసిన లేఖలను సైతం ఎండీకి అందించారు. దీనిపై స్పందించిన ఎండీ సంబంధిత అధికారికి ఫోన్ చేసి వెంటనే ఐదు అభివృద్ధి పనులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అందులో జెమిని కాలనీ, బెంజ్‌మెన్ గల్లీ, అజర్ గల్లీలలో 100 ఎంఎం డయా తాగునీటి పైపులైన్ వేయాలని, వైఎస్‌ఆర్ పార్కు, జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కంప్లెక్స్‌ల వద్ద 200 ఎంఎం డయా సీవరేజీ పైపులైన్ వేయాలన్నారు.



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి



ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఆర్. కృష్ణయ్య, నిరుద్యోగ జేఏసీ నేతలు, వీఆర్‌ఏలు

కవాడిగూడ: జీఓ నం. 81 ప్రకారం 61ఏళ్ల వయసు పై బడిన వీఆర్‌ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్, వీఆర్‌ఏ వారసుల జేఏసీ అధ్యక్షుడు ఆంజనేయులు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో వేలాది మంది వీఆర్‌ఏలతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్‌ఏలకు పే–స్కేల్ అమలు చేసి, వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఆ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిగతా 3797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా 15 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కొంత మంది మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 456 మంది వీఆర్‌ఏలు మరణించారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాపల్లి అంజి, వేముల రామకృష్ణ, సతీష్, రాజశేఖర్, అనిల్, రాందేవ్, రాంసాగర్, హరీష్, శ్రీను, మహ్మద్, చందు, రజనీకాంత్, ఇబ్రహీం, హనుమాన్‌లు, ఖదీర్, లింగస్వామి, బాలయ్యతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సెల్‌ఫోన్‌కు బానిసైతే జీవితం ఆగమవుతుంది

సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, వాసవీ క్లబ్ ప్రతినిధులు

కవాడిగూడ: పిల్లలు సెల్‌ఫోన్ జోలికి వెళ్లకుండా చదువులపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ సూచించారు. సోమవారం వాసవీక్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కవాడిగూడ చిత్రానర్సింహులు స్మారక ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... సెల్‌ఫోన్‌కు బానిసైతే జీవితం ఆగమవుతుందన్నారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్ వాడాల్సిన అవసరం లేదన్నారు. తల్లిదండ్రుల సమక్షంలోనే ఫోన్ వాడాలని సూచించారు. జీవితంలో పిల్లలకు తల్లి తండ్రి గురువు ముగ్గురు మాత్రమే ముఖ్యమైనవారని అన్నారు. విద్యార్థులు వారిని కాదని సొంతనిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్లారి నరేంద్రకుమార్, పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ కృష్ణారావు, గాంధీనగర్ ఎస్సై హరీష్, వాసవీ క్లబ్ ప్రతినిధులు అనంతుల దయాకర్, పబ్బ శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, హెచ్‌ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు నాగయ్య, సుబ్రహ్మణ్యం, సౌజన్య, కిరణ్మయి, హేమలత, అనురాధ, సమలత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మన నగరం విభిన్న సంస్కృతుల సమాహారం



జపాన్ ప్రతినిధి కేయికో తోనేగవాను సన్మానిస్తున్న సుధామాల, విజయకుమార్

చిక్కడపల్లి: విభిన్న సంస్కృతుల సమాహారం మన హైదరాబాద్ నగరమని వైజ్‌మెన్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థల జపాన్ ప్రతినిధి కేయికో తోనేగవా అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో వైజ్‌మెన్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అంతర్జాతీయ మైత్రి సంస్థ (హైపా) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భారతీయ జీవన విధానం గొప్పదన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు సుధామాల మాట్లాడుతూ.. వైజ్‌మెన్ సేవా సంస్థలు భారత్, జపాన్‌ల మధ్య సాంస్కృతిక మైత్రికి కృషిచేస్తున్నాయని అన్నారు. ప్రజల జీవన విధానాన్ని అధ్యయనం చేసేందుకు ఇప్పటి వరకు 400 మంది జపాన్ నుంచి నగరానికి వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వేమరాజు విజయకుమార్, వినయ్‌కుమార్, వినయ్ స్వరూప్, నారాయణరావు, చక్రపాణి, విద్యారణ్యస్వామి, విశ్వనాథ్, రమాదేవి, విశాలాక్షి, మధుమతి, లక్ష్మీమానస తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు మార్గ నిర్దేశనం చేసేవారు కావాలి

రాష్ట్ర సంగీత అకాడమీ చైర్‌పర్సన్ ప్రొ. అలేఖ్య పుంజాల



చిక్కడపల్లి: రెండు తెలుగు రాష్ట్రాలలో ఎందరో కళాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించే వారు మాత్రం చాలా అరుదుగా ఉంటారని రాష్ట్ర సంగీత అకాడమీ చైర్‌పర్సన్ ప్రొ. అలేఖ్య పుంజాల అన్నారు. అలాంటి వారిలో ఒకరు కేవీ రమణాచారి ఒకరని అన్నారు. ఉన్నతాధికారిగా ఉన్న సమయంలోనూ ఆ తర్వాత కూడా కళాకారులకు మార్గ నిర్దేశనం చేస్తున్నారని ప్రశంసించారు. సోమవారం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జాతీయ సంగీత కళాకారులు సంఘం నిర్వహణలో నాట్య గురువు అలేఖ్యతో పాటు పద్మశ్రీ ద్విశత సహస్రఅవధాని డా. నాగఫణి శర్మను కేవీ రమణాచారి సత్కరించారు. శాస్త్రీయ సంగీత రంగ ప్రముఖులు రాఘవాచారి, హరిప్రియ, డీవీ మోహనకృష్ణ, ద్వారం సత్యనారాయణ, డి.శ్రీరామమూర్తి, జానకీరాములకు సప్తస్వర సంగీత సమ్రాట్ బిరుదులతో సత్కరించారు. డాక్టర్ నాగఫణి శర్మ మాట్లాడుతూ.. పలు సంస్థలు కేవీ రమణాచారి జన్మదిన వేడుకలను నెలంతా జరపటం చూస్తే ఆయన వ్యక్తి కాదు ఒక వ్యవస్థని అర్థమయ్యిందన్నారు.